

షడ్రుచుల కలయిక.. ఉగాది వేడుక..

- తెలుగు వారి తొలి పండుగ రేపే..
- భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్న ప్రజలు
- ముస్తాబవుతున్న ఆలయాలు
- పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాల ఏర్పాట్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 : కోకిల రాగాలు.. మామిడిపూతల ఘుమఘుమలు.. వేపపూతల సువాసనలు, చెట్లకొత్తచిగుళ్లు.. వీటిన్నింటికి సంకేతం ఉగాది పండుగ. ఆనందోత్సవాల నడుమ జరుపుకునే తెలుగు ప్రజల తొలిపండుగ, నూతన సంవవత్సరం రానేవచ్చింది. 'శుభకృత్ నామ'కు గుడ్‌బై చెబుతూ.. మంగళవారం తొలి సంవత్సరాది ఉగాది 'శ్రీక్రోధినామ'లోకి అడుగిడుతున్నాం. అన్నదమ్ముల మధ్య అనుబంధాలు, అక్కచెల్లెళ్ల ఆప్యాయతలు, పెద్దల దీవెనలతో సుఖసంతోషాలు మమతానురాగాలు విరిసి.. పండుగ ఆరంభం నుంచి ఆద్యంతం శుభం జరుగాలని యావత్ ప్రజానికం కోరుకుంటోంది.

హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే తెలుగు తొలిపండుగను చైత్రశుద్ధపాడ్యమి నాడు జరుపుకోవడం ఆనవాయితి. కొత్త జీవితానికి శుభారంభం పలికే సమయం ఉగాది పర్వదినం. షడ్రుచుల కలయికగా పులుపు, తీపి, ఉప్పు, కారం, ఛేదు, వగరుల సమ్మేళనమే ఉగాది పచ్చడిలాంటి మిశితమైన జీవన ప్రయాణానికి మార్గనిర్దేశం చేస్తోంది. వసంత రుతువు ఆరంభమయ్యే రోజే చైత్రశుద్ధ పాడ్యమి ఈరోజు అశ్వని నక్షత్రం ఉంటుంది. మాసాల్లో చైత్రం, తిథిల్లో పాడ్యమి, నక్షత్రాల్లో అశ్విని అగ్రభాగంలో ఉంటాయి. అంటే కాలచక్ర గమనంలో ఏ ఏడాదికి ఆ ఏడాది మళ్లీ మొదలయ్యే రోజునే తెలుగు సంవత్సరాది ఉగాదిగా పిలుచుకుంటారు. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూషడ్రసోపేతమైన పచ్చడితో కొత్త ఏడాదికి స్వాగతం పలికేదే ఈ పర్వదినం.

వారం ముందు నుంచే సందడి..

ఉగాది వస్తుందంటే చాలు తెలుగు లోగిళ్లలో వారం ముందు నుంచే పనులు ఆరంభమవుతాయి. ఇంటిని శుభ్రం చేసుకోవడంతో మొదలు కొత్త బట్టలు, వస్తుసామగ్రి కొనుగోలు చేసుకోవ్యాడంలో ప్రజలు ఆసక్తి చూపిస్తారు. ఈ పండుగనాడు తెల్లవారు జామునే తలంటు స్నానాలు ఆచరించి ఇంటి గుమ్మాలు, దుకాణాలకు మామిడి తోరణాలు కట్టి, ఇళ్లముందు ఆవుపేడతో కల్లాపి చల్లి రంగవల్లులతో అలంకరిస్తారు. శాస్త్రోత్తంగా తమ ఇష్ట దైవాలకు పూజలు చేసుకొని నూతన సంవత్సరమంతా శుభం జరుగాలని కోరుకుంటారు. కొత్త పనులు వ్యాపారాలకుఇదేరోజు శ్రీకారం చుడుతారు. గోవులను అలంకరించి పూజలు చేస్తారు. తిథినక్షత్రాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని సైతం అరంభిస్తారు. ఎడ్ల బండ్ల పోటీలు, నోరూరించే వంటకాలతో ఉగాదినిఉత్సాహంగా జరుపుకుంటారు. దేవాలయాలు ముస్తాబవుతున్నాయి.

లక్ష్మీ, గంగాదేవీల అనుగ్రహం..

అభ్యంగనమంటే నువ్వుల నూనెతో తలంటు పోసుకోవడం అర్థంగా పేర్కొంటారు. ఉగాది నాడు సూర్యోదయానికి ముందే మహాలక్ష్మి నూనెలో, గంగాదేవి నీటిలో ఆవహించి ఉంటారని పురాణాల్లో పేర్కొంటారు. అందుకే నూనెతో తలంటుకొని స్నానం చేయడం ద్వారా లక్ష్మీ,గంగాదేవిల అనుగ్రహం లభిస్తుందని శాస్త్రం పేర్కొంటుందంటారు. ఇక ఆయుర్వేదంలో కూడా తైల అభ్యంగనం ఆరోగ్యానికి మంచిదని చెప్పడంతో ఈ దిశగా ఆచరించే విషయంలో ఎక్కువ మంది మొగ్గు చూపుతారు.

పండుగ నేపథ్యం..

ఉగాది పర్వదినం నేపథ్యంలో రెండుకథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. సృష్టిని బ్రహ్మప్రారంభించిన రోజే యుగాది.. లేదా ఉగాది అన్న కథనం ఒకటైతే. శాలివాహనుడు పట్టాభిశక్తుడైన రోజునే ఉగాదిగా పేర్కొనడం మరో కథనం. చైత్రశుద్ధపాడ్యమి నాడు మత్స్యావతారంలో ఉన్న సోమకుడు అనే రాక్షసుని హతం చేశాడని పేర్కొంటున్నారు. దీంతోనే ఉగాది పండుగ చేసుకోవడం ఆరంభమైందని పండితులు చెబుతారు. కాలగణాన్ని గృహ,నక్షత్ర, రుతు, మాస, వర్షాదికులను బ్రహ్మదేవుడు ఈరోజే సృష్టించాడని పూర్వీకుల అభిప్రాయం. అందుకే వసంత రుతువు ఈ రోజే అరంభం కావడానికి పరిగణలోకి తీసుకొని కొత్త జీవితానికి నాంది పలికేందుకు ఉగాది జరుపుకుంటారని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇక రెండో కథనంలో శాలివాహనుడు పట్టాభిశక్తుడు కావడం పండుగకు మరో కారణంగా చరిత్రకారులు చెబుతున్నారు.

షడ్రుచులు అంటే జీవితానికి..

ఉగాది నాడు ఇష్టదైవానికి ప్రత్యేక పూజలు చేసి పంచభక్షపరమాన్నాలతో షడ్రసోపేతమైన ఉగాది పచ్చడిని నైవేద్యంగా పెట్టడం సంప్రదాయగా కొనసాగుతోంది. షడ్రుచులు అంటే జీవితపు పరమార్థాలు, సుఖదుఃఖాలు, సంతోషవిషాదాలు, కోపతాపాలు ఇవే మానవ జీవితాన్ని నిర్దేశిస్తాయి. వీట్లో ఏది తక్కువైనా ఆ జీవితం వెలితిగానే మిగిలిపోతుంది. ఈ సారాంశాన్ని ప్రపంచానికి తెలియజేయడం కోసమే కాబోలు ఉగాది పచ్చడి సేవనం. పచ్చట్లో తీపి, కారం, ఉప్పు, పులుపు, వగరు, చేదు సమపాలలో ఉన్నట్లే జీవితంలోనే కష్టసుఖాలు ఉంటాయంటారు.

ఒక్కొక్క రుచి ఒక్కొ భావన..

షడ్రుచుల సమ్మేళనం సేవించే ఉగాది పచ్చడిలో ఒక్క రుచి ఒక్కొ అనుభవంగా పేర్కొంటారు. బెల్లం తీపికి ఆనందానికి సంకేతమైతే, ఉప్పు జీవితంలో ఉత్సాహం రుచికి



గుర్తుగా పేర్కొంటారు. వేపలోని ఛేదుగుణం బాధల్గించే అనుభవాలను గుర్తు చేస్తోందని చెబుతారు. చింతపులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులను గుర్తు చేస్తోందని, పచ్చిమామిడి వగరు, కొత్తసవాళ్లకు ప్రతీకకగా అప్రమత్తం చేస్తోందని చెబుతారు. సహనం కోల్పోయే సహనాన్ని ఎదుర్కొనేందుకు మిరప కారం సహాయపడుతోందని పండితులు వెల్లడిస్తున్నారు.

రాశిఫలాలు, జాతక చక్రాలు..

ఉగాదికి మరోప్రాశస్త్యం ఉంది. రాశిఫలాలు, జాతకచక్రాలను

మిగతా 6వ పేజీలో..



వైజ్ఞానికంగా ఉగాది ప్రత్యేకత..

వసంత రుతువులో వచ్చే ఉగాది సమయంలో అనేక రకాల విషజ్వరాలు, ఆటలమ్మ, ఇతరత్రా వ్యాధులు వ్యాపించే సమయంగా వైజ్ఞానికులు పేర్కొంటారు. ఈ సమయంలో ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవడానికి ఉగాది పండుగా కీలకమని పేర్కొంటారు. ఉగాది పచ్చడి దివ్య ఔషధమని ఈ పచ్చడిని ఒక్క రోజే కాకుండా ఉగాది నుంచి శ్రీరామనవమి లేదా చైత్రపాడ్యమి వరకు ప్రతీరోజు స్వీకరించాలంటారు. ఇలా 9 నుంచి 15 రోజుల పాటు ఉగాది పచ్చడి తినడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొంటారు. పచ్చడిలో వాడే వేపపువ్వు కడుపులో ఉండే నులిపురుగులను చంపేస్తోందని, వేపగాలి, ఆటలమ్మ, అమ్మోరు లాంటి వ్యాధులను ధరి చేరనీయొద్దని చెబుతారు. మామిడి యాంటివైరల్ లక్షణాలను కలిగి ఉండి కఫం, వాతం, పైత్యం లాంటి దోషాలను అదుపులో ఉంచుతోందని పేర్కొంటారు. తైలాభ్యంగన స్నానం వల్ల శరీరంలో ఉన్న విషపదార్థాలు తొలగిపోతాయని దీనికి తోడు పండుగ నాడు ఇల్లు శుభ్రం చేసి గడపకు మామిడి తోరణాలు, బంతిపువ్వులు కట్టడం వల్ల వాతావరణ పరిస్థితుల నుంచి రోగాలు సక్రమించే అవకాశం తగ్గిపోతుందంటారు. బంతిపూవ్వులు యాంటిసెప్టిక్, యాంటిబయోటిక్ లక్షణాలను కలిగి ఉంటాయని మామిడి ఆకులు ఇంట్లోకి రోగక్రిములు రాకుండా చూస్తాయని పేర్కొంటారు. వెరసి విజ్ఞానపరంగా కూడా ఉగాదికి అనేక ప్రాముఖ్యతలు ఉన్నాయి.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సా : 6.36 గం..
సహర్ : మంగళవారం ఉ : 4.42 గం..

ఆదివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 44.4°C | కనిష్ఠం : 22.2°C

జిల్లాలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 7 : జిల్లాలో ఆదివారం 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 22.2 డిగ్రీలు నమోదు కాగా, గరిష్టంగా 44.4 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా ఎండలు పెరగడంతో ఉష్ణోగ్రతలు ప్రతీరోజు పెరుగుతూ వస్తున్నాయి. ఏప్రిల్ మెదటి వారంలోనే ఎన్నడు లేనివిధంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం.



పాలకుర్తిలో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి

- ఇఫ్తార్ విందులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, ఏప్రిల్ 7 : రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి బషారత్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మతసామరస్యం కోసం పాటుపడుతుంటే బీజేపీ మతాల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. నెల రోజులపాటు ముస్లింలు ఉపవాస దీక్షలు చేయడం అభినందనీయమన్నారు. నాయకులు రాపాక సత్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, ఎర్రబెల్లి రాఘవరావు, నిరంజన్‌రెడ్డి, కాకిరాల హరిప్రసాద్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీతారాంనాయక్

రానున్నది రామరాజ్యమే..

- బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

వెంకటాపూర్ (రామప్ప), ఏప్రిల్ 7 : ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రామరాజ్య స్థాపన జరుగుతుందని ఆ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. ములుగు నియోజకవర్గంలోని వెంకటాపూర్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గులాబీ దండు రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుని అది చాలదన్నట్టు ఇప్పుడు దేశంపై పడ్డారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుమార్తె కవిత లిక్కర్‌డాన్‌గా మారారని, ఇది రాష్ట్ర సంక్షేమానికి ఎంతమాత్రం మంచిది కాదన్నారు. బీఆర్ఎస్ కుంభకోణాలు, అక్రమాలు, అడ్డగోలు బాగోతాలు బట్టబయలవుతాయన్న అక్కసుతో లేని కుట్రలకు తెరలేపడం సమంజసం కాదని హితవు పలికారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఉపాధ్యక్షుడు భుక్య జవహర్‌లాల్, నాయకులు సరోత్తమ్‌రెడ్డి, పైడాకుల మల్లేష్, అల్లె శోభన్, కారుపోతుల యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి..

గోవిందరావుపేట : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సహరిద్దులో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీతారాం నాయక్ మాట్లాడారు. ఒకప్పుడు మావోయిస్టులు ప్రగతిభవన్‌ను పేల్చివేసి నిబద్ధతను చాటుకోవాలని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. నిజమైన ఎన్‌కౌంటరా.. బూటకమా..? అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే ప్రజలకు ఎలా తెలుస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నాలుగునెలల పాలనలో రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తోందని, పంటలు ఎండి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ములుగులో సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం చేసిన ప్రయత్నంలోనూ తాను ముందున్నానని గుర్తు చేశారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడంలో ప్రయత్నం చేశానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా పోటీచేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా ఇన్‌చార్జి సరోత్తమ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు రుద్రారపు సురేష్, తక్కళ్లపల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.



కురవి మండలం నేరడ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష రాసేందుకు సెంటర్‌కు వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. జిల్లాలో 10 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. 6వ తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు1,343 మంది విద్యార్థులు హాజరు కానుండగా 1107హాజరు కాగా, 236 గైర్హాజరయ్యారని తెలిపారు. 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్నసీట్లను భర్తీ చేసేందుకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 1043 మంది హాజరు కానుండగా 859 హాజరు కాగా 184 గైర్హాజరయ్యారని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు నిర్ణీత సమయానికంటే గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకొని పరీక్ష రాశారని డీఈవో తెలిపారు. తొర్రూరు మండలం గుర్తూరు, నెల్లికుదురు మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాలను డీఈవో సందర్శించగా, మరిపెడ, డోర్నకల్ పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ మందుల శ్రీరాములు సందర్శించినట్లు తెలిపారు.

వేసవి ఉద్యాన పంటలకు అగ్నిప్రమాదం జరుగకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న



మహబూబాబాద్‌అగ్రికల్చర్, ఏప్రిల్7 : ఈ వేసవిలో ఎండలు బాగా ముదిరిపోయి వేడిగాలులు వీస్తున్నాయి. ఉద్యానపంటలకు అగ్నిప్రమాదాలు వాటిల్లే ప్రమాదం ఉన్న దృష్ట్యా, నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి జినుగు మరియన్న రైతులను ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏటా ముదురు మామిడి, సపోట, నిమ్మ, బొప్పాయి, అరటి, ఆయిల్‌పామ్ తోటల్లో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అలాగే బిందు సేద్య పరికరాలు కూడా ఈ ప్రమాదంలో కాలిపోయే అవకాశం ఉందని తెలిపారు. వాటికి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆ తోటల్లో కలుపు, పిచ్చిపూలు, పొదళ్లను, రకరకాల కలుపు గడ్డిమొక్కలు పెరిగి అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నాయని, తోటల చుట్టు నిప్పు పెట్టడం కూడా ఒకకారణమని చెప్పారు. తోటచుట్టు ఫైర్‌లైన్ ఏర్పాటు చేసుకోవాలని, తోట ఆరుఅడుగుల దూరం వరకు ఎండిన అకులు లేకుండా తీసివేసుకోవాలన్నారు. చెట్లకు పిచ్చి తీగలు, దొండ తీగలు, ఎండిన కొమ్మలు ఉంటే వాటిని తొలగించాలని, ప్రూనింగ్, కొమ్మ కత్తిరింపులు, పునరుద్ధరణ చేసుకోని మొక్కను చెట్టును ఒక క్రమ పద్ధతిలో పెంచుకోవాలని సూచించారు. అంతర్‌పంటలను సాగు చేసుకుని ఎండు అకులు, ఇతర వ్యర్థాలు బికాంపోజర్‌తో కుళ్లే విధంగా చేపట్టి పశుగ్రాసాలను పెంచి కూరగాయల పంటల సాగు చేసుకోవాలని సూచించారు.



అనుభూతులను మూటగట్టుకుని..

నిట్‌లో ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు

- కొత్తజ్ఞాపకాలతో విద్యార్థుల తిరుగుముఖం
- 3 రోజులుగా క్యాంపస్‌లో సందడి
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- 50 ఈవెంట్ల నిర్వహణ.. అలరించిన ప్రోప్‌షోలు
- స్ఫూర్తినింపిన డైరెక్టర్ కట్స్

5

పూలే, అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

- 21న మానుకోటలో పూలే, అంబేద్కర్ జనజాతర
- చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంవీ.రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ రమణ

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 7 : మహనీయులు జ్యోతిబాపూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయసాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంవీ. రమణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో ఆదివారంచేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా ఆయన హాజరైమాట్లాడారు. ఈనెల 11న జ్యోతిబాపూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 21న మానుకోట జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో పూలే, అంబేద్కర్ జనజాతరను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్‌ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు చేస్తోందన్నారు. మూడువేల కిందటి మనుస్మృతిని ప్రాచీన భారత రాజ్యంగంగా ప్రవేశపెట్టాలని చూస్తోందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు క్రమక్రమంగా రిజర్వేషన్లు దూరం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జ్ గర్వందర రాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, చేతి వృత్తిదారుల సం ఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, బానోత్ వెంకన్న, గంద్రకోటి కుమార్, మంద విక్రమ్‌గౌడ్, దుగ్గి లక్ష్మీనారాయణ, మందుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణీకుల ఆందోళన

- పగిలిన బస్సు అద్దాలు

తొర్రూరు, ఏప్రిల్7 : తొర్రూరు బస్టాండ్ ఆవరణలో జగద్గిరిగుట్ట వెళ్లే ప్రయాణీకులు ఆర్టీసీ సిబ్బందిపై ఆందోళన చేపట్టారు. ఈ ఘటన ఆదివారం రాత్రి బస్టాండ్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం. రాత్రి 8 గంటలకు తొర్రూరు నుం చి జగద్గిరిగుట్ట వెళ్లే బస్సు ప్రయాణీకులతో నిండిపోయింది. 70 మంది ప్రయాణీకులు ఎక్కడంతో డ్రైవర్ బస్సును పాయింట్ వద్ద నుంచి తీశాడు. మరికొంత మంది ప్రయాణీకులు తాము ఎక్కాలని, బస్సు ఆపాలని ఆందోళన చేపట్టారు. డ్రైవర్ దిగివచ్చి పూర్తిగా నిండిపోయింది. మరో బస్సులో రావాలనడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రయాణీకులు ఒకేసారి డ్రైవర్‌పైకి విరుచుకు పడటంతో బస్సు అద్దాలు పగిలిపోయాయి. దీంతో ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రయాణీకులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా వారు వినకపోవడంతో వారిని స్టేషన్‌కు తరలించారు. దర్యాప్తు చేపట్టి నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



పగిలిన బస్సు అద్దాలు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ప్రయాణీకులు

ఓరుగల్లు వాసుల అభిమానం మరువలేనిది...

మీడియాతో సినీ హీరో నవదీప్

వడ్డేపల్లి, ఏప్రిల్ 7: ఓరుగల్లుతో తనకు ఉన్న అభిమానం మరువలేనిదని, అందమైన లోకేషన్లకు పెట్టింది పేరు ఓరుగల్లు నగరమని సినీ హీరో నవదీప్ అన్నారు. తాను నటించిన లవ్, మౌళి చిత్ర విశేషాలను ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ.. గతంలో తాను ఐదు సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులకు గుర్తుండేలా మెప్పించానని అన్నారు. తాను నటించిన నూతన చిత్రం లవ్, మౌళి ఈ నెల 19న విడుదల కానుందని ప్రేక్షకులు, అభిమానులు ఆదరించాలని కోరారు. ఈ సినిమాలో తాను హీరోగా, పంఖురి గిద్వానీ హీరోయిన్‌గా నటించగా, మిగతా పాత్రల్లో భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ నటిస్తున్నారని చెప్పారు. నైరా క్రియేషన్స్ అండ్ శ్రీకర బ్యానర్‌పై ఈ చిత్రాన్ని హైదరాబాద్‌లోని సిస్పేస్ స్టూడియోలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. చిత్రానికి రచన, దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ అవనింద కాగా, సంగీత దర్శకులుగా గోవింద్ వసంత సమకూర్చగా పాటలను అనంత శ్రీరాం రాశారని వెల్లడించారు.


మాట్లాడుతున్న నవదీప్

'ఉపాధి'లో మహిళలదే అగ్రస్థానం

● 2023-24లో ఎక్కువ పనిరోజులు వారివే.. ● కూలీ రేట్లు పెరగడంతో మహిళల్లో పెరిగిన ఉత్సాహం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ కూలీ పనులు మహిళలకు వరంగా మారాయి. మహిళలు ఇంటిని చక్కబెట్టడమే కాకుండా కుటుంబ పోషణకు కావాల్సిన సహాయాన్ని తమవంతుగా చేస్తున్నారు. అలాగే పురుషులతో సమానంగా వ్యవసాయ కూలీ పనులు కూడా చేస్తూ తాము ఎందులో కూడా తక్కువ కాదని నిరూపిస్తున్నారు. 2023-24 ఏడాదిలో పని దినాలు వినియోగించుకున్న ఉపాధి హామీ కూలీల్లో పురుషులకంటే మహిళలే ముందు వరుసలో నిలిచారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించిన మొదట్లో పురుషులు ఎక్కువగా పనులకు వెళ్లేది కానీ రోజులు గడుస్తున్న కొద్ది ఈ పనుల్లో మహిళలు దూసుకెళుతున్నారు. మగవారితో సమానంగా పార, గడ్డపార చేతపట్టుకుని పనులు చేస్తున్నారు. మహిళలకు వారి వారి గ్రామాల్లోనే ఉపాధి హామీ పని దొరుకుతుండటంతో వారు వ్యవసాయ పనులు ఉన్న రోజులు మినహాయిస్తే మిగతా అన్ని రోజుల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో ఉన్న 14 మండలాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి.

- పురుషులకంటే మహిళలే ఎక్కువ

2023-24 సంవత్సరంలో జిల్లాలో మొత్తం 25,97,662 మంది ఉపాధి హామీ కూలీ పనులు చేయగా వీరిలో 60శాతం మహిళలే పని చేసినట్లు జిల్లా డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. 2023 సంవత్సరం జనవరి నెలలో 20,998, ఫిబ్రవరిలో 1,38,941, మార్చిలో 2,37,038, ఏప్రిల్ లో 3,56,672, మే నెలలో 4,03,576, జూన్‌లో 4,89,487, జులైలో 1,03,847, ఆగస్టులో 31,089, సెప్టెంబర్‌లో 23,406, అక్టోబర్‌లో 70,782, నవంబర్‌లో 97,376, డిసెంబర్ నెలలో 69,029 మంది ఉపాధి హామీ పనులు చేయగా, 2024 జనవరి నెలలో 62,471, ఫిబ్రవరి నెలలో 1,73,117, మార్చిలో 3,19,842 మంది



ఆత్మకూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న మహిళలు

కూలీలు ఉపాధి హామీ పనులు చేశారని, వీరిలో 60శాతం మహిళలు పని చేశారు.

- కూలీ రేట్లు పెరగడంతో ఉత్సాహం

మన రాష్ట్రంలో ఉపాధిహామీ కూలీ మార్చి 31 వరకు రూ.272 చెల్లించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీ రేటు రూ.28 పెంచింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఉపాధి హామీ కూలీలకు రూ.300 చెల్లిస్తున్నారు. కూలీ రేట్లు కూడా పెరగడంతో మహిళలు ఉపాధి హామీ పనులు చేసేందుకు మరింత ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్క కూలీకి 100 రోజులు కల్పిస్తుంది. కూలీ రేటు పెరగకముందు కొందరు కూలీలు వారికి కేటాయించిన కనీసం 100 రోజులు పనులు కూడా చేసే వారు కాదని, ప్రస్తుతం కూలీ రూటు పెరగడంతో అందరు 100 రోజుల కూలీ చేస్తారని ఉపాధి హామీ కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈజీఎస్‌లో ముఖ గుర్తింపు హాజరు

ఎన్‌ఎంఎంఎస్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7 : ఉపాధి హామీ పనుల్లో కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుడుతోంది. ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా కూలీల ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. దీనికోసం ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఎన్‌ఎంఎంఎస్ యాప్ పనితీరును పరిశీలించారు. ఈ యాప్ వాడటానికి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

పనుల్లో పారదర్శకతకు పెద్దపీట

ఉపాధిహామీ పనుల్లో కూలీలు అలా వచ్చి ఇలా వెళుతూ సరిగా పని చేయకుండానే కూలీ డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు చాలా వరకు ఉన్నాయి. కూలీల హాజరు నమోదు విషయంలో తరచుగా వివాదాలు తలెత్తుతున్న సందర్భాలు చాలావరకు ఉన్నాయి. గతంలో చేసిన సామాజిక తనిఖీల్లో మస్టర్లపై ఎన్నో లోపాలు బయటపడ్డాయి. ఈ లోపాలను అడ్డుకట్ట వేసేందుకు, అర్హులైన కూలీలకు న్యాయం చేసేందుకు కూలీలకు ముఖ విధానం హాజరు అనేది ఎంతగానో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆ యాప్‌ను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. హనుమకొండ జిల్లాలో 208 గ్రామాలు ఉన్నాయి. సుమారు150 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. 91వేల చిల్లర జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 62వేల జాబ్ కార్డులు ఆక్టివ్‌గా ఉన్నాయి. జిల్లాలో మొత్తం ఒక లక్షా 4వేల మంది కూలీలు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న జాబ్‌కార్డుల్లోని సభ్యులందరికీ ఇప్పటికే ఆధార్ కార్డును అనుసంధానం చేశారు. త్వరలో ఆ యాప్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

హాజరు విధానం అమలు ఇలా..

ఉపాధిహామీ పని ప్రదేశాల్లో మొదటగా కూలీల ముఖ చిత్రాలను నమోదు చేస్తారు. తర్వాత కూలీ ఫొటో, ఆధార్‌తో అంతకుముందు దిగిన ఫొటో సరిపోలితేనే వారికి హాజరు పడుతుంది. కూలీలు పనిచేసే రోజు ఉదయం, మధ్యాహ్నం కూలీల ముఖ చిత్రీకరణ తప్పనిసరిగా ఉంటుంది. ఈ విధానం ద్వారా ఉపాధి పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉంటుందనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచన. ఈ విధానం త్వరలో ఆచరణలోకి వచ్చే అవకాశం ఉంది.

మునిసిపాలిటీలకు అమృత్‌యోగం

- తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు
- ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీలకు నిధులు కేటాయింపు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలకు అమృత్ యోగం లభించింది. మునిసిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో కులాయి కనెక్షన్లు, ట్యాంకుల నిర్మాణం, కాలనీల అభివృద్ధి, పైప్‌లైన్‌ల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను శనివారం విడుదల చేసింది. అమృత్ -2 విడతలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల, నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లి, వర్ధన్నపేట ఐదు మున్సిపాలిటీలకు మోక్షం కలిగిస్తూ రూ.132కోట్లు విడుదల చేసిం ది. ఆయా జిల్లాల అధికారులకు బడ్జెట్‌కు సంబంధించిన ప్రొసీడింగ్‌లను జారీ చేసి ంది. దీంతో సంబంధిత మునిసిపాలిటీల అధికారులు అభివృద్ధి పనులు చేసేం దుకు కాంట్రాక్టర్‌లను కాల్‌ఫర్ చేసినట్లు తెలిపారు. కానీ లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండడ ంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో పనులు నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలలో పనులను బట్టి నిధులు విడుదల చేస్తామని మునిసిపాలిటీల వారిగా నిధులు విభజించలేదని తెలిపారు.

యూఐడీఎఫ్ ద్వారా బల్దియాకు నిధులు

ఈ యేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిసిపాలిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించినా గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీకి అమృత్ -2 విడతలో భాగంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. మూడేళ్ల కిందట మొదటి విడతలో భాగంగా వరంగల్ బల్దియాకు అమృత్ పథకం ద్వారా 562 కోట్లు కేటాయించగా, ఆ నిధులతో గ్రేటర్ వరంగల్‌లోని 66 డివిజన్‌లలో ఇప్పటికి అభివృద్ధి పనులు జరుగుతూనే ఉన్నాయి. దీంతో వరంగల్ బల్దియాను మినహాయించి ఉమ్మడి జిల్లాలోని మిగతా ఐదు మునిసిపాలిటీలకు నిధులు కేయించినట్లు అధికారులు తెలిపారు. అయితే వరంగల్ నగర పాలక సంస్థకు కేటాయించిన అమృత్ నిధులు పూర్తయిన తర్వాత యూఐడీఎఫ్ (అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్ ఫండ్) ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలు ముగిసిన తర్వాత యూఐడీఎఫ్ నిధులు విడుదల చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నిధుల ద్వారా వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోబోతున్నాయి.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: హైదరాబాద్‌లోని ఆల్ ది బెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో అందజేయనున్న ఉగాది పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్. నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా రంగాల్లో సేవలందిస్తున్న ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఏప్రిల్ 21న హైదరాబాద్‌లో నిర్వహించే పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంపిక చేసిన వారికి పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 10లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు 9652347207 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని మోడల్ స్కూల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ జిల్లాలో 910 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 665 మంది హాజరు కాగా 245 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో 660 మంది విద్యార్థులకు గాను 489 మంది హాజరుకాగా 171 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ డీఈవోలు అబ్దుల్ హై, వాసంతి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హనుమకొండటౌన్, ఏప్రిల్7: ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను హనుమకొండ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. సోమవారం ఉదయం కేయూ జంక్షన్‌లో పోలీసులు ట్రాక్టర్‌ను ఆపడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులను చూసి ట్రాక్టర్ దిగి పారిపోయేందుకు యత్నించాడు. డ్రైవర్ అనుమల సొమయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా ఎలాంటి ఆధారాలు చూపించలేదు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

గెలుపు కాదు.. అధిక మెజారిటీ సాధించాలి..

● వరంగల్ లోక్‌సభ ఎన్నికకు సన్నద్ధమవ్వండి.. ● జిల్లా నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష.. దిశా నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 7: వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయమే కాదు.. అత్యధిక మెజారిటీ సాధన లక్ష్యంగా పని చేయాలని జిల్లా నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ లోక్‌సభ ఎన్నిక, పార్టీ విజయం, మెజారిటీ, నియోజకవర్గాల వారిగా పార్టీ పరిస్థితి, ఎన్నిక ప్రచార సభలు, కమిటీల నిర్మాణం, నేతల బాధ్యతలు తదితర అంశాలపై మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ అసెంబ్లీ సెగ్మెంట్ల ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలతో ఆదివారం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సమీక్ష జరిపారు. పార్టీ గెలుపు కోసం దిశ, నిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు సాధించడంతో ఢిల్లీ అధిష్ఠానం ఇక్కడి నుంచి ఎంపీ సీట్లపై దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రమంలో మరింత కష్టపడి చేయాల్సిన బాధ్యత నెలకొందన్నారు. 14 ఎంపీ స్థానాలను గెలిపించి అధిష్ఠానం ఆశలను నెరవేర్చే లక్ష్యంతో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు తెలియచేశారు. ఈ క్రమంలో ప్రతీ సీటు కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో టికెట్ అందరూ ఆశిస్తారని, అయితే అధిష్ఠానం అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకుందని రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు సూచించారు. పార్టీకి సేవలందించిన అందరికీ న్యాయం చేస్తుందని, ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావు లేదన్నారు. ఈ బాధ్యత తనదిగా గుర్తించాలని పేర్కొన్నారు. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థి డాక్టరు కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని జిల్లా నేతలకు ఉద్బోధించారు. టికెట్ దక్కని వారు నిరాశ చెందొద్దని, న్యాయం చేస్తానని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో గ్రామస్థాయి నుంచి పార్టీ విజయ వ్యూహాల ప్రణాళికలను రూపొందించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులు ఈ విషయంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ నివేదికలు సిద్ధం చేసి అందచేయాలని ఆదేశించారు. ప్రతికూల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు. లోక్‌సభ ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 18లోగా బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కమిటీలు నిర్మించాలని సీఎం సూచించారు. కమిటీలను నిర్మించి బాధ్యతలను స్పష్టం చేయాలన్నారు. కమిటీలు పనితీరును బేరీజు వేసుకొని భవిష్యత్తులో వారికి పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు. ఎన్నికల క్రమంలో వరంగల్ లోక్‌సభ పరిధిలో మూడు ప్రచార సభలకు హాజరు అవుతానని రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు తెలియచేశారు. రెండు నుంచి మూడేసి నియోజకవర్గాలను కలిపి ఒక ప్రచారసభ నిర్వహణ ఉండేలా ప్రణాళికలు ఉంటాయన్నారు. దీనిపై త్వరలోనే స్పష్టత ఇవ్వనున్నట్లు నేతలకు సూచించారు. అగ్రనేతలు రాహుల్‌గాంధీ లేదా ప్రియాంకగాంధీ కూడా ఎన్నిక ప్రచార క్రమంలో వరంగల్ వచ్చే అవకాశం



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు

ఉంటుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రజాదరణ పొందేలా రూపకల్పన చేశారన్నారు. తుక్కుగూడ సభలో ప్రకటన తర్వాత ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోందన్నారు. ఈ క్రమంలో మేనిఫెస్టోను గ్రామ గ్రామంలో ఇంటింటికీ తీసుకెళ్తే విజయం తథ్యమన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏ భేషాజాలు లేకుండా ప్రతీ ఒక్కరు సమన్వయంతో పని చేయాలని రేవంత్‌రెడ్డి దిశా, నిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణ, కడియం శ్రీహరి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టరు రియాజ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ఎస్సీ సెల్ నాయకుడు మోజెస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పక న్యాయం చేస్తా..

వరంగల్ లోక్‌సభ టికెట్ ఆశించి భంగపడ్డ వారిలో సమీక్షకు హాజరైన దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్, బొడ్డు సునిత మోజెస్ తదితరులతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కడియం కావ్య గెలుపు కోసం పని చేయాలని, భవిష్యత్తులో తప్పక న్యాయం చేస్తానని, ఇది తన భరోసా అంటూ నచ్చ చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా టికెట్ ఆశించి నిరాశ పడిన వారిని స్వయంగా కలిసి మాట్లాడాలని సూచించారు.

15 నుంచి కేయూ ఎంఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ 15 నుంచి ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు 2023-24 ఏడాదికిగాను పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి ఆదివారం షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 15, 18, 20, 22తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

16 నుంచి బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 16 నుంచి కేయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 16, 18, 20, 22 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల జరుగుతాయని తెలిపారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

18 నుంచి ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 18 నుంచి కేయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 18, 20, 23, 25 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షల జరుగుతాయని తెలిపారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

16 నుంచి ఎంపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 16 నుంచి కేయూ పరిధిలో ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 16, 19, 22, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షల జరుగుతాయన్నారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

కేయూ బీఫార్మసీ సెమిస్టర్ ఫీజుల చెల్లింపు గడువు 18

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 6: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ సీబీసీఎస్ రెండు, నాలుగో, ఆరో రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులు ఏప్రిల్ 18 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌చాడ రాధికారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 20 వరకు ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. పరీక్షలు ఏప్రిల్, మేలో నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ఎంహెచ్‌డీ జిల్లా అధికార ప్రతినిధిగా ప్రసాద్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7: మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధిగా కేతపాక ప్రసాద్ ఆదివారం నియమితులయ్యారు. మాదిగ హక్కుల కోసం, ఆత్మ గౌరవం, అభివృద్ధి కోసం నిస్వార్థంగా పోరాడాలని ఎంహెచ్‌డీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వరంగల్ క్రైం, ఏప్రిల్7: అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో టూవీలర్‌పై వెళుతున్న గిన్నారపు రాజు(34) మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హౌస్ షిఫ్టింగ్ వర్క్ చేసే అనంతసాగర్ గ్రామానికి చెందిన రాజు ఆదివారం ఉదయం హనుమకొండకు వస్తున్న క్రమంలో హసన్‌పర్తి చెరువు వద్ద హనుమకొండ నుంచి కరీంనగర్ వెళుతున్న కారు ఢీకొట్టింది. వేగంగా ఢీకొట్టడంతో పక్కన పొలాల్లో ఎగిరిపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తన భర్త మృతికి కారణమని కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాని రాజు సతీమణి రాధ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయం

రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్

న్యూశాయంపేట, ఏప్రిల్ 7 : సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హంటర్ రోడ్డులోని ఉమ్మడి వరంగల్ జిల్లా యూనియన్ కార్యాలయంలో పీఆర్‌టీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు వాంకుడోతు జ్యోతి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే శాశ్వతంగా పరిష్కారం చేయాలని కోరారు. కొందరు రాజకీయ నాయకులు ఉపాధ్యాయ సంఘం పేరుతో స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని అలాంటి వారి మాటలకు మోసపోవద్దని సూచించారు. అనంతరం ములుగు జిల్లా అధ్యక్షుడు జ్యోతి మాట్లాడుతూ.. ఈ వేసవిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, ఉపాధ్యాయ ఉద్యోగుల డీఏలు త్వరగా మంజూరు చేయాలని అన్నారు. ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో చేర్చిన సీపీఎస్ రద్దు అంశాన్ని త్వరగా పరిష్కారం చేయాలని, ప్రభుత్వం కాలయాపన చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజు, ప్రధాన కార్యదర్శి హర్షం సురేష్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్, జనగాం అధ్యక్షుడు మరిపూకల యాదగిరి, ప్రధాన కార్యదర్శి వాంకుడోతు రవి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లబోజు సుధాకర్‌లతో పాటు ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రౌతు రాజు, రాష్ట్ర నాయకులు రామగిరి సురేష్, జిల్లా నాయకులు సంతోష్, చిరంజీవిలతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

అనుభూతులను మూటగట్టుకుని..

● నిట్‌లో ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు ● మూడు రోజుల పాటు సందడిగా క్యాంపస్

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్‌లో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) ఆదివారం ముగిసింది. వరంగల్ నిట్‌తో పాటు దేశంలోని 40 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. స్ప్రింగ్ స్ప్రీని పురస్కరించుకొని నిర్వహించిన 50కిపైగా ఈవెంట్లలో పాల్గొని తమ సత్తాను చాటారు. ప్రతిభాపాఠవాలను ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్నారు. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను చాటేందుకు ఈ వేడుకలు వేదికగా నిలిచాయి. కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. సరికొత్త అనుభూతులు, మరిచిపోలేని జ్ఞాపకాలతో విద్యార్థులు ఇళ్లకు తిరుగు ముఖం పట్టారు.

చివరి రోజు ఈవెంట్లు

ఆదివారం ముగింపు రోజున యూత్ రెడ్ క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో స్కావెంజర్ హంట్ ఈవెంట్ జరిగింది. క్యాంపస్‌లోని వివిధ ప్రదేశాల్లో వైద్య చికిత్సలో ఉపయోగించే కత్తెర, కాటన్ డెట్టాల్, మెడికల్ కిట్ వస్తువులను ఉంచారు. కొన్ని సూచనలు, ఆధారాల సాయంతో విద్యార్థులు వీటిని గుర్తించడం ఈ వెంట్‌లోని అంశం. కరోకే అనే మరో ఈవెంట్‌ను కూడా నిర్వహించారు. కొందరికి వేదికల మీద పాటలు పాడడమంటే భయం. ఆ భయాన్ని తొలగించే ఉద్దేశంతో ఈ ఈవెంట్‌ను నిర్వహించారు. వాట్స్ డిఫరేట్ అనే ఈవెంట్ కూడా విద్యార్థుల ప్రతిభకు పరీక్ష పెట్టింది. రెండు సారూప్య ఇతివృత్తాల మధ్య వ్యత్యాసాలను ఇచ్చిన సమయంలోనే గుర్తించడం ఈ ఈవెంట్ ప్రత్యేకత. వరంగల్ నిట్ సోలో ఐడల్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు పాటలు పాడారు. ఇందులో బాగాపాడిన వారు ఆదివారం నిర్వహించిన చివరి రౌండ్‌లో సింగిల్‌లో పాల్గొన్నారు. ఇందులో బాగా పాడినవారిని విజేతలుగా ప్రకటించి బహుమతులను అందచేశారు. మేళా అనే ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కొన్ని ఆటలను ఆడారు. వారి స్కోర్ ఆధారంగా విజేతలుగా ప్రకటించారు.

ప్రతిభకు కొలమానంగా ఈవెంట్లు

స్ప్రింగ్ స్ప్రీలో విద్యార్థులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింప చేసిన ఈవెంట్ నుక్కడ్ నాటక్. వివిధ సామాజిక అంశాలను ఇతి వృత్తంగా ఎంచుకొని విద్యార్థులు వివిధ పాత్రలతో నటించిన ఈ ఈవెంట్ వాస్తవానికి ఒక వీధి నాటకం. కొరియో నైట్స్ ఈవెంట్ కూడా విద్యార్థుల ప్రశంసలను అందుకున్నది. స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా మూడురోజులు పాటు రాత్రిపొద్దుపోయిన తర్వాత ప్రదర్శించిన పాప్‌షోలు విద్యార్థులను ఉర్రూత లూగించాయి. శనివారం రాత్రి ప్రముఖ గాయకుడు నకాష్ అజీజ్ మ్యూజిక్ షోలో పాల్గొన్న విద్యార్థులు పాటలకు అనుగుణంగా చిందులేశారు. అంతకు ముందు రోజు చౌరస్తా బ్యాండ్, హరిచరణ్ బ్యాండ్ ప్రోషోలు కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలు విజయవంతం కావడంలో నిట్ కల్చర్ సొసైటీ, నిట్ డ్రామా అండ్ మ్యూజిక్ క్లబ్ విశేషంగా కృషి చేశాయి. కోఆర్డినేటర్లు చందర్, సాహిత్, తనీష్, ప్రశాంత్ నేతృత్వంలో వివిధ విద్యార్థి బృందాలు స్ప్రింగ్‌స్ప్రీ విజయవంతంలో తమ వంతు పాత్రను పోషించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య తన సహకారాన్ని అందించారు.



నిట్ నుంచి తరలివెళ్తున్న విద్యార్థినులు

ఏకాంతంగా ఆలోచిస్తే జీవితంలో ఏమి కావాలో తెలుస్తుంది..

నిట్ స్ప్రింగ్ స్ప్రీలో విద్యార్థులతో హీరో నవదీప్

హనుమకొండ టౌన్, ఏప్రిల్7: ఏకాంతంగా ఆలోచనలు చేస్తే జీవితంలో మనకేమీ కావాలనేది దొరికిపోతుందని హీరో నవదీప్ విద్యార్థులకు సూచించారు. నిట్ స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా ఆదివారం కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నవదీప్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 18 ఏళ్ల వయస్సులోనే సినిమా అవకాశాలు రావడంతో వరుసగా సినిమాలు చేసుకుంటూ పోయానని, ఏ రోజు నాకు ఏమీ కావాలి.. అని ఆలోచన చేయలేదన్నారు. కరోనా సమయంలో జీవితంలో నాకేమి కావాలి అనే ఆలోచనలు మొదలైనప్పటి నుంచి జీవితంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయని, జీవితం గతంకన్నా బెటర్‌గా ముందుకెళుతోందన్నారు. సరిగ్గా ఆలోచన చేస్తే కావాల్సింది దొరుకుతుందని సూచించారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, అవకాశాలు కోసం ఎక్కడా తిరగాల్సిన అవసరం లేదని, ఇంట్లో ఉండి యూట్యూబ్‌లో కంటెంట్ ఉన్న వీడియో అప్‌లోడ్ చేస్తే అవకాశం నిన్నే వెతుకుంటూ వస్తుందన్నారు. హీరో కాకపోతే ఏమి అయ్యేవారని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. పక్కాగా ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఒకరి కిందనైతే పని చేసేవాడిని కాదన్నారు. తన ఫిట్‌నెస్‌కు వారంలో ఆరు రోజులు జిమ్ చేయడమే కారణమన్నారు. క్లాస్‌లో ఫస్ట్ బెంచా.. లాస్ట్ బెంచా.. అని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు క్లాస్ అవుట్ స్టాండింగ్ స్టూడెంట్ అని క్లాస్ బయటనే ఉండేవాడినని ఫన్నీగా సమాధానమిచ్చి అందరినీ నవ్వించారు. సమయం దొకినప్పుడు ట్రావెల్ చేస్తే కొత్త ప్రాంతాలు, వ్యక్తుల పరిచయం ద్వారా నాలెడ్జ్ పెంపొందించుకోవచ్చన్నారు. మీరు మెకానికల్ ఇంజనీరులైతే.. నేనే లైఫ్ ఇంజనీర్ అని విద్యారుంథల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు.



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న హీరో నవదీప్

తన అభిమాన క్రికెటర్ ధోని, నటుడు చిరంజీవి అని చెప్పుకొచ్చారు. కొన్ని సినిమాలు ఫ్లాప్ కావడానికి అవగాహనలేని దర్శకులతో సినిమాలు ఒప్పుకోవడమే కారణమన్నారు. కాగా, విద్యార్థులతో జరిగిన చిట్‌చాట్‌లో పలు ప్రశ్నలకు సమాధానమిచ్చి వారిలో స్ఫూర్తి నింపారు. తన జీవితానికి దగ్గరగా ఉన్న కథతో నిర్మించిన లవ్ మౌళీ సినిమాలో హీరో గా నటించానని, ఈ నెల 19న విడుదల వుతుం దని, ప్రతి ఒక్కరూ ఆదరించాలని నవదీప్ కోరారు.

ఫిల్మ్ మేకింగ్‌లో చాలా ఒడిదొడుకులుంటాయి..

సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్7: ఫిల్మ్ మేకింగ్ అంటే చాలా ఒడిదొడుకులు ఉంటాయని సీతారామం చిత్ర దర్శకుడు హను రాఘవపూడి అన్నారు. మూడు రోజుల నిట్ స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిట్‌లోని ఏఎల్‌సీ ఆడిటోరియంలో విద్యార్థులతో డైరెక్టర్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 ఏళ్లకే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి చాలా అడ్డంకులను ఎదుర్కొన్నానన్నారు.



తన సినిమాల్లో విషాదకరమైన అంశాలు ఎక్కువ గా ఉండటానికి కారణం ప్రజలు సంతోషాలకన్నా విషాదకరమైన అంశాలే ఎక్కువగా గుర్తుంచుకోవడం వలన అన్నారు. సీతారామం షూటింగ్ సమయంలో కశ్మీర్‌లో ప్రతికూల వాతావరణంలో పనిచేయాల్సి వచ్చిందన్నారు. డైరెక్టర్ కావాలంటే పుస్తక పఠనం బాగా చేయాలన్నారు. జాబ్ మీద ఆసక్తి లేక సినిమాల వైపు వచ్చానన్నారు. దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి వర్క్ స్టైల్‌ను ఇష్టపడుతానన్నారు.

గిరిజన బాలికల హాస్టల్లో వసతుల కరువు

- కురవిలో రూ. కోటి వెచ్చించి నిర్మించారు.. సౌకర్యాలు మరిచారు
- మూడేళ్లుగా నిరుపయోగంగా గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనం
- నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు

కురవి, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలో రూ.కోటి వెచ్చించి, నిర్మించిన గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల (గవర్నమెంట్ టీడబ్ల్యూఏహెచ్-గర్ల్స్) భవనం మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం కురవి జడ్పీహెచ్ఎస్ పక్కనఉన్న గిరిజన బాలికల వసతి గృహం భవనం పూర్తిగా శిథిలం కావడం, విద్యార్థుల సంఖ్యకు అనుగునంగా స్థలం, తరగతి గదులులేక పోవడంతో హాస్టల్‌కు, ఉన్నత పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉండేందుకు వీలుగా హాస్టల్ నిర్మించాలని అధికారులు అంచనాలు తయారు చేశారు. ఐటీడీఏ ద్వారా రూ.కోటి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. 12 గదులతో భవనాన్ని నిర్మించి మూడేళ్లుగా తాళాలు వేసి వదిలి వేయడం విమర్శలకు తావిస్తోంది.

ఇది బాలికల హాస్టల్ నిర్మాణమేనా!

కురవిలో నిర్మించిన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల భవనం బాలికల కోసమే నిర్మించారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భవనాన్ని అయితే నిర్మించారు.. కానీ, బాలికలు ఉండడానికి ఏ విధమైన సౌకర్యాలు లేకుండా నిర్మించడం ఐటీడీఏ అధికారుల పనితీరును వేలెత్తి చూపెడుతుంది. కనీసం విద్యార్థులు తాగేందుకు నీటి సౌకర్యం కోసం మంచినీటి బోరు వేయించకపోవడం, మరుగుదొడ్లు నిర్మించకపోవడం, ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించేందుకు బ్లాక్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఐటీడీఏ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. హాస్టల్‌లో వంట వండేందుకు కిచెన్‌షెడ్డు, విద్యార్థులు తినేందుకు డైనింగ్‌హాల్, నీటినిల్వ కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించలేదు. కనీసం విద్యార్థులు హాస్టల్లోకి ప్రవేశించేందుకు సైతం రహదారి అనువుగా లేదు. హాస్టల్ ప్రాంగణం మొత్తం బండరాళ్లతో, చెత్తతోనిండి పోయింది. కనీసం గ్రౌండ్‌ను చదును చేయలేదు. పాఠశాలకు ప్రహరీ నిర్మించారు కానీ.. గేట్లను ఏర్పాటు చేయడం మరిచిపోయారు. బాలికల హాస్టల్‌కు అనుగుణంగా కాంపౌండ్ వాల్‌పై ఐరన్ ఫెన్సింగ్ నిర్మించలేదు. బాలికల హాస్టల్‌లో ఉండాల్సిన ఎటువంటి వసతులు లేకుండా హాస్టల్ భవనాన్ని నిర్మించడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా హాస్టల్ భవనంలో పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

150 మంది విద్యార్థినులు..



కురవిలో నిర్మించి వదిలేసిన ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనం

కురవి మండల గిరిజన బాలికల వసతి గృహం బాలికలు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. వసతి గృహంలో 350 మంది విద్యార్థినులు ఉంటుండగా, కేవలం 15 గదులు మాత్రమే ఉన్నాయి. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మరో 15 అదనపు గదులు కావాల్సి ఉంది. చాలాకాలం క్రితమే ఈ వసతి గృహాన్ని ఆశ్రమ పాఠశాలగా మార్చిన ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా ఏ ఒక్క సౌకర్యాన్ని కల్పించలేదు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఈ వసతి గృహంలోనే విద్యాబోధన చేస్తారు. దీంతో వసతులులేక విద్యార్థినులు తమ ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రిని వరండాలో ఉంచి తరగతి గదుల్లో విద్యనభ్యసిస్తున్నారు. స్నానాల గదులు, మరుగుదొడ్లు సరిపోక విద్యార్థినుల ఇబ్బందులు అన్నీ.. ఇన్నీకావు.. విద్యార్థినుల సంఖ్యకు అనుగనంగా 45 మరుగుదొడ్లు కావాల్సి ఉండగా కొన్ని మాత్రమే ఉన్నాయి. స్నానాల గదులు సరిపోకపోవడంతో విద్యార్థినుల స్నానాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వసతి గృహంలో వంటశాల, డైనింగ్‌హాల్, ఆఫీసరూం, స్టాఫ్‌రూం లాంటి సౌకర్యాలు లేవు. దీనికి తోడు హాస్టల్ భవనం వర్షానికి కురుస్తూ శిథిలావస్థలో ఉండడం కూడా విద్యార్థినులను అనేక ఇబ్బందులకు గురి చేస్తోంది.



శిథిలావస్థలో ప్రస్తుత ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనం

పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలి..

జ్యోతిబసు ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి, కురవి



ప్రభుత్వం నిర్మించి వదిలేసిన హాస్టల్ భవన నిర్మాణంలో బాలికలకు తగ్గట్లుగా అన్ని సదుపాయాలు కల్పించాలి. రానున్న విద్యాసం వత్సరంలోపు సౌకర్యాలు మెరుగు పరిచి నూతన భవనంలో తరగతులు ప్రారంభించాలి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసే వరకు పోరాడుతాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి



ఆరేపల్లి నవ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం అమనగల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. అమనగల్‌కు చెందిన ఆరేపల్లి మహేష్-హైమా దంపతుల పెద్ద కుమార్తె నవ్య (14) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తండ్రి మహేష్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 4న తల్లిదండ్రుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో మనస్తాపానికి గురైన నవ్య అదేరోజు రాత్రి 11 గంటలకు ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి, ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం నవ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధిరించారు. పోస్టుమార్టం అనంతరం నవ్యమృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. తండ్రి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరు మృతి



తరాల సైదులు (ఫైల్)

కురవి, ఏప్రిల్ 7 : మండలకేంద్రం శివారు జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ మండలం మల్యాలకు చెందిన తరాల సైదులు (40) తన భార్య నీలమ్మతో కలిసి ఖమ్మంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్నారు. ఇదే సమయంలో కురవిలో గప్‌చుప్ బండినడుపుకునే లావుడ్య రమేష్ షాప్‌బంద్ చేసి లింగ్యాతండాకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి వద్ద ఇద్దరి ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో తరాల సైదులు తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మరో ద్విచక్రవాహనదారుడు లావుడ్య రమేష్‌కు సైతం తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మతల్లి దేవాలయంలో చోరీ

- రూ.70 వేల నగదు, ఆభరణాల అపహరణ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : జిల్లాకేంద్రంలోని గోపాలపురం కాలనీలో ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి హుండీలో ఉన్న రూ.70 వేల నగదు, వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. పెద్దమ్మతల్లి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి భక్తులు కానుకల రూపంలో వేసే హుండీతో పాటు ఆలయంలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. హుండీలో సుమారు రూ.70వేల వరకు ఉండవచ్చని అర్చకులు తెలిపారు. ఈవిషయంపై టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులు



లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులకు మెమొంటో అందించి శాలువాతో సత్కరిస్తున్న గ్రామస్తులు

గూడూరు, ఏప్రిల్ 7 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని స్పెషల్‌క్లాస్ కాంట్రాక్టర్ లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులు అన్నారు. మదనాపురంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి దివ్య మంగళశాసనములతో శ్రీలక్ష్మీగోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి నూతన దేవాలయ విమాన గోపుర, ధ్వజశిఖర ప్రతిష్ఠ మహోత్సవం విజయవంతంగా సాగిందన్నారు. ఈ సందర్భంగా లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులను ఆదివారం గ్రామస్తులు మెమోంటో అందించి శాలువాతో సత్కరించారు. గత వారంరోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నూతన ఉత్తేజంతో సాగాయన్నారు. మదనాపురంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకే శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించినట్లు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వేడుకల విజయవంతం కోసం పాటుపడిన ప్రతి ఒక్కరికి సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. లింగాల రోహిత్‌రెడ్డి-అనుపమ దంపతులు, గ్రామస్తులుపాల్గొన్నారు.

వాలీబాల్ కోచ్‌కు క్రీడాకారుల ఆర్థిక సాయం

ఇనుగుర్తి, ఏప్రిల్ 7 : వాలీబాల్ క్రీడలలో ఎంతోమందికి శిక్షణ ఇచ్చి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఇనుగుర్తికి సట్ల బిక్షపతికి ఆయన వద్ద శిక్షణ పొంది క్రీడాకారులుగా ఎదిగిన రమేష్, సంతు, శ్రీనివాస్, ప్రవీణ్ ఆదివారం రూ.5,116లు ఆర్థిక సాయం అందించారు. కోచ్ బిక్షపతి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న క్రీడాకారులు తమవంతుగా సాయం అందించినట్లు పేర్కొన్నారు. త్వరలో పెద్దమొత్తం ఆర్థిక సాయం చేయనున్నట్లు రమేష్ తెలిపారు. దాతల సాయం కోసం, ప్రభుత్వ ప్రోత్సాహం బిక్షపతి ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎంతోమందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దిన బిక్షపతిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని క్రీడాకారులు కోరారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇనుగుర్తి, ఏప్రిల్ 7 : చిన్నముప్పారానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గంగాధర్ తండ్రి వెంకన్న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆదివారం వెంకన్న మృతదేహం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం వెంకన్న పాడెమోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి గంగాధర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. మార్నేని రఘు, శంకర్, జాటోతు రంగ్యా, నీలం దుర్గేష్, గుండా వెంకన్న ఉన్నారు.

'అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

డోర్నకల్, ఏప్రిల్ 7 : జిల్లాలో ఈనెల 14 జరుగనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. డోర్నకల్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం దళిత సంఘాల నాయకులు బీఆర్. వీరస్వామి, నాయిని వెంకటేశ్వర్లు అధ్యక్షతన అంబేద్కర్‌జయంతికార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో దళితులు, అణగారిన వర్గాలకు రిజర్వేషన్‌ల ద్వారానే రాజ్యాంగ ఫలాలు అందుతాయని అంబేద్కర్ అన్నారని గుర్తు చేశారు. దళితులందరూ విద్యానభ్యసించడం ద్వారానే చైతన్యవంతులవుతారని, అలాగే విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ కల్పించడం ద్వార అభివృద్ధిలోకి వస్తారని భావించి అందుకు రాజ్యాంగ పరంగా హక్కులు కల్పించారని గుర్తు చేశారు. అంబేద్కర్ జయంతి రోజున డోర్నకల్‌లో అన్ని వీధుల గుండా ఆయన స్ఫూర్తిని నింపుతూ.. నిర్వహించే ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలియమ్‌జాన్సన్, మునిసిపల్ కౌన్సిలర్లు బసిక అశోక్, బోరగళ్ల శరత్‌బాబు, కందుల విక్రమ్‌బాబు, సంగమయ్య, ఏపూరి వెంకటరమణ, గాజుల వేణు, కేకే.రాజ్, వీరస్వామి, మేకల రామారావు, పేరాల నర్సయ్య, కట్యూరి గోపి, మాతంగి అనిల్, చిలుక మనోజ్, కొత్తపల్లి నర్సింగరావు, పుట్టల వెంకటేశ్వర్లు, మధుసూదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మారపు వెంకన్న

ఎంపీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు బీజేపీకే

- పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న

మరిపెడ, ఏప్రిల్ 7 : ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలోని మెజార్టీ సీట్లు బీజేపీకే దక్కనున్నాయని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న అన్నారు. ఆదివారం మరిపెడలోని బీజేపీ ఆఫీస్‌లో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరుగగా, ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ కమిటీల పటిష్టత, లాభార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమాలను పార్టీ కార్యకర్తలకు వివరించారు. ఇంటింటికి వెళ్లి కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బుల్లెట్ కృష్ణ, కాంతమ్మ, గంగాధర్, జనార్దన్, లింగంనాయక్, దిలీప్, భరత్ గౌడ్, కొమ్ము శోభన్, వీరన్న, హుస్సేన్, జగన్, సుధాకర్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు అర్ధరహితం..

● గార్ల :హైదరాబాద్ తుక్కుగూడ కాంగ్రెస్‌సభలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ చేసిన మోసపూరిత ప్రకటనలు అర్ధరహితమని బీజేపీ మహిళమోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి ఆక్షేపించారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేక రేంవత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధపడుతుందన్నారు. కార్యక్రమంలో జంపాల శ్రీను, ఎడ్ల రాజశేఖర్, భూక్యా వెంకన్న, పూనేం రాంబాబు, వీర్యా పాల్గొన్నారు.

కుక్కల దాడులతో జనం బెంబేలు



కుక్కల దాడిలో గాయపడిన బాబు (ఫైల్)

తొర్రూరు, ఏప్రిల్ 7 : పట్టణంలో వీధి కుక్కలు దాడులు చేస్తుండటంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని సాయినగర్, రాజీవ్‌నగర్, బస్‌డిపో ఏరియా, టీచర్స్ కాలనీ, కాకతీయకాలనీ, అంబేద్కర్ నగర్, తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు ఒంటరిగా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గత రెండునెలల క్రితం పట్టణాన్ని ఆనుకుని ఉన్న చింతలపల్లి గ్రామంలో ఒకేసారి ఐదుగురిపై వీధి కుక్కలు దాడిచేయడంతో తీవ్ర గాయాలై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందిన ఘటనలు ఉన్నాయి. గత రెండురోజుల క్రితం డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మంగళపల్లి వెంకటేష్ ఇంటి బయట ఉన్న గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేసి, చంపేశాయి. పట్టణంలోని వివిధ కాలనీల్లో కూడా దాడులు చేస్తున్నాయి. మునిసిపాలిటీ అధికారులు కుక్కలను పట్టేకార్యక్రమం చేపట్టినా అది నామమాత్రంగానే మిగిలింది. నియంత్రణకు అనిమల్ బర్త్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసినా ఉపయోగంలో లేకుండా పోయింది. పట్టణ ప్రజలు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రంజాన్‌ను ఆనందంగా జరుపుకోవాలి

డోర్నకల్, ఏప్రిల్ 7 : రంజాన్ పండుగను ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు వాజీద్ అన్నారు. ఆదివారం డోర్నకల్‌లోని 70మంది నిరుపేద ముస్లింలకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతండ్రి ఎంఏ రజాక్, తన స్నేహితుల జ్ఞాపకార్థం నిరుపేద ముస్లింలకు రంజాన్ పండుగ సామగ్రిని అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాఫర్, ఫిరోజ్, కరీం, ఖాజా, అన్వర్‌లు పాల్గొన్నారు.

మొక్కజొన్నసాగుపై క్షేత్రస్థాయి ప్రదర్శన

నెల్లికుదురు, ఏప్రిల్ 7 : రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు పీర్నాక సుధాకర్ సాగు చేసిన మొక్కజొన్న పంటపై ఆదివారం క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 250 మంది రైతులకు గోదావరి ప్లాంట్‌వారి డిలైట్ మొక్కజొన్న విత్తనాలు, అధిక దిగుబడులపై అగాహన కల్పించారు. మొక్కజొన్నసాగులో అధిక దిగుబడి సాధించిన రైతు పీర్నాక సుధాకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర అగ్రో ఏజెన్సీస్ నిర్వహకుడు దేవాసందీప్, పొదిల రాజు, అన్వేష్, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

పెద్దవంగర, ఏప్రిల్ 7 : పెద్దవంగర ఉన్నత పాఠశాలలో 1998-99లో విద్యాభ్యాసం చేసిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 25 ఏళ్ల తరువాత చదువులమ్మ ఒడిలో కలిసి విద్యాబోధనలు చేసిన ఉపాధ్యాయులతో పాఠశాలలో జరిగిన మధురమైన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఆద్యంతం సంతోషంగా గడిపారు. అనంతరం గురువులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుసూదన్, మోహన్, సాదిక్, మురళి, కమలాకర్, పూర్వ విద్యార్థులు నాగేష్, అబ్బయ్య, వెంకన్న, చారి, కిషన్, రత్నాకర్, సంతోష్, జ్యోతిర్మయి, జయ, స్వప్న, విజేందర్, నిరంజన్, సతీష్ పాల్గొన్నారు.

రైళ్లలో సాధారణ బోగీల సంఖ్య పెంచాలి

- ప్రముఖ సామాజిక వేత్త, డాక్టర్ పరికిపండ్ల అశోక్

గార్ల, ఏప్రిల్ 7 : దక్షిణ మధ్యరైల్వే మంత్రిత్వశాఖ ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్యను పెంచి, పేదలకు రైలుమార్గం సులభతరం చేయాలని కోరుతూ ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ నేతృత్వంలో ఆదివారం గార్లలో కోటి ఉత్తరాల ఉద్యమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వంలో పేదలకు రైలులోప్రయాణించడం భారంగా మారిందన్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్య పెంచాలన్నారు. మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నా యక్, జెవిశ్య, వినోద్‌కుమార్‌జైన్, రాంసింగ్‌నాయక్, రాజశేఖర్ పాల్గొన్నారు.



బోగీల సంఖ్య పెంచాలని కోరుతూ కోటి ఉత్తరాల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న పరికిపండ్ల అశోక్

రామయ్య మరణం తీరనిలోటు : సీపీఐ

గార్ల, ఎప్రిల్ 7 : నమ్మిన సిద్ధాతం కోసం పేదల ప్రజల పక్షాన పోరు సాగించిన సీపీఐ సీనియర్ నాయకుడు పాతురి రామయ్య అకాల మరణం సీపీఐ ప్రజా ఉద్యమాలకు తీరనిలోటుని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వి జయ సారథి అన్నారు. ఆదివారం మద్దివంచ గ్రామంలో పాతురి రామయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు, గార్ల వైస్ ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాస్, భిక్షమయ్య, పిచ్చయ్య, వీరభద్రం, రాగం రమేష్, మాగం లోకేష్ పాల్గొన్నారు.

షడ్రుచుల కలయిక.. ఉగాది వేడుక

(3వ పేజీ తరువాయి)

తెలుసుకునే పంచాగ శ్రవణం ఈ పండుగలో కొసమెరుపు. కొత్త సంవత్సరంలో రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని, గ్రహశాంతులు జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచాంగ శ్రవణం తప్పని సరి అంటారు. పంచాంగమంటే పంచఅంగాలు అని వాటినే తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలుగా ఐదు అంగాలని పెద్దలు చెబుతారు. ఆంగ్లసంవత్సరాది న్యూ ఇయర్‌ను అందరూ అనుసరిస్తున్నపటికి శుభకార్యాలు, పూజాపునస్కారాల కోసం ఈ నాటికి పంచాంగాన్నే అనుసరిస్తున్నారు. అందులో ఉండే తిథి, వార, నక్షత్రాలకు అనుగుణంగా ముహూర్తాలను నిర్ణయించుకుంటారు. ఉగాదితో అమలులోకి వచ్చే పంచాంగం ఏడాది చివరి వరకు అమలులో ఉంటుంది.

పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం..

పంచాంగ శ్రవణానికి ఎంతో ప్రాశస్త్యముంది. ఉగాది నాడే ఆదాయ, వ్యయాలు, రాజ్యపూజ, అవమానాలు, కందాయఫలాలు, రాశిఫలాలు తెలియజేసే పంచాంగం ఈ పండుగనాడు వినడం పూర్వకాలం నుంచి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం ఉగాది నాడు దేవాలయాలకు వెళ్లి అర్చకులను కలసి ఏకార్తెలో వర్షాలు కురుస్తాయి. ఈ ఏడు గ్రహణాలు ఏమైన ఉన్నాయా... ఏరువాక ఎప్పుడు సాగాలి లాంటి కీలక అంశాలను తెలుసుకుంటారు. దీనికితోడు ఉగాది అంటే కవిసమ్మేళనాలకు కూడా పెట్టింది పేరు. సరస్వతి పుత్రులైన కవులు, రచయితలను గౌరవించుకునే సాంప్రదాయం అనాదిగా కొనసాగుతోంది.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



మస్జిద్ ఇఫ్తార్‌లో భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, ఏప్రిల్ 7 : హిందు, ముస్లీల మధ్య మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. కేసముద్రం మస్జీద్‌లో మాజీ సర్పంచ్ జాటోత్ సుజాత హరీష్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ ముస్లింలకు భోజనం వడ్డించి రంజాన్‌ను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీష్‌నాయక్, నీలం దుర్గేష్, ముత్యాల శివకుమార్, గుగులోత్ వీరునాయక్, కముటం శ్రీను, ధరావత్ భీమానాయక్ పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో నలంద విద్యార్థుల ప్రభంజనం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 : కాకతీయ యూనివర్సిటీ ఈ నెల 6 విడుదల చేసిన 1,3,5 సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ నూకల శ్రీరంగారెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ఫలితాలు వెల్లడించారు.

● **బీఎస్సీ మ్యాథ్స్ విభాగం :** కోడి మానస 8.66 జీపీఏ, సీహెచ్.జ్యోత్స్న 8.32, వై.తేజస్వీ 8.16, సాయిమాల 8.13, పూజిత 8.45, శ్రావణి 8.00 జీపీఏ సాధించినట్లు తెలిపారు.


● **బీఎస్సీ సైన్స్ విభాగం :** కట్ల మానస 8.11 జీపీఏ, సంద రుచిత 8.08, బి. రుత్విక్ 8.02, కె.శిరీష 8.19 సాధించినట్లు తెలిపారు.

● **బీకాం విభాగం :** బానోతు అంకిత 8.81 జీపీఏ, నలమాస ప్రవళిక 8.68, కె.సునయని 8.52, లోయ ప్రణీత 8.41, బి.సాయికుమార్ 8.31, అలువాల మౌనిక 8.31, రాచకొండ గౌరీశ్రీ 8.25, శివరాత్రి శిరీష 8.15, ఇల్లందుల సుమంత్, శ్రీకాంత్ 8.0 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

● **బీ.ఏవిభాగం :** మడత రవళి8.00 జీపీఏ, రాపోలుకళ్యాణి 7.78, బానోతు ఆశ 7.74, భూక్య దుర్గాబాయి 7.60, నల్లబోయిన రజని 7.60, షేక్ అన్వర్ 7.68, మహ్మద్ సుమయ్య 7.55, నల్లబోయిన రాగిని 7.34, శ్యామల శ్రావణి 7.24 జీపీఏ సాధించటంతో పాటు 80మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

పల్లెబిడ్డ లోహిత్‌కు అరుదైన గౌరవం

- ఆగ్రో హోమియోపతిపై రిసెర్చ్‌తో దక్కిన అవార్డు
- రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న పురస్కారం



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 7 : పల్లెబిడ్డ జంగం లోహిత్‌కు అరుదైన గౌరవం దక్కిం ది. ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. ఈ అరుదైన గౌరవం దక్కడం వల్ల ఆ గ్రామస్థులు హర్షం వ్యక్త చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే. జిల్లాలోని కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన జంగం రవి-సామ్రాజ్యం దంపతుల కుమారుడు లోహిత్ రాష్ట్రంలోని సంగారెడ్డి ఎంఎన్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. లోహిత్ షార్ట్‌టర్మ్ స్టూడెం ట్ షిప్ ఇన్ హోమియోపతి విభాగంలో ఆరు నెలలుగా ఆగ్రో హోమియోపతిపై రిసెర్చ్ చేశాడు. గైడ్ డాక్టర్ శ్రీవిద్య నేతృత్వంలో లోహిత్ తన మెదడుకు పదును పెట్టి సమగ్ర సమాచారంతో రీసెర్చ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు ఆయన పూర్తి చేసిన ఎన్ ఎక్స్‌పైరీ మెంటల్ స్టడీ టూ ఎవల్యూట్ ధ ఎఫీకేసీ ఆఫ్ ఆల్ట్రిస్ ఫరినోసా ఆఫ్ డిఫరెంట్ పొటెన్సీస్ ఆన్ ఐరన్ డిఫెన్సీ క్లోరిసిస్ ఆఫ్ గ్లిసిన్ మాక్స్ (సోయాబీన్) అనే అంశానికి అవార్డు లభించింది. ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని యశోభూమి ద్వారకలో ఈనెల 10, 11న నిర్వహించే కాన్ఫరెన్స్‌లో చివరి రోజు 11న భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా లోహిత్ అవార్డును అందుకోనున్నారు. కాగా, తాను రీసెర్చ్ చేసిన గ్రంథానికి అవార్డు లభించడం తన అదృష్టమని, ఇది తన తల్లిదండ్రులు, గ్రామానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని విద్యార్థి లోహిత్ తెలిపారు. లోహిత్‌కు అవార్డు దక్కడం పట్ల జిల్లావాసులు, తట్టుపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామయ్యకు సన్మానం

సీరోలు, ఏప్రిల్ 7 : కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొంపెల్లి రామయ్యను వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఖమ్మం జిల్లా పల్లెగూడెంలో ఆదివారం క్రోధినామ తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రామయ్య రచించిన 'నా గమనం' కవితా సంపుటిని డాక్టర్ ఎస్.పి.వి.కిషోర్ బాబుచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ సమాజహితాన్ని కోరే సాహిత్యం ఎల్లవేళలా ప్రజల మనసుల్లో నిలిచిపోతుందని అన్నారు. అనంతరం రామయ్యను ఘనంగా సన్మానించారు. మువ్వ శ్రీనివాసరావు, రామడుగు నరసింహాచార్యులు, శేషగిరిరావు,కాంతేశ్వర్‌రావు, సునంద, నర్సయ్య ఉపేందర్, జయవాసు, జహీరుద్దీన్, భారతిశ్రీనివాస్, శైలజశ్రీనివాస్ పాల్గొన్నారు.